



మ్యూజిక్ అకాడమీ హాలు జనంతో కిటకిట లాడుతూంది ముందు పదివరసల్లో ఓ వార సీటులో శూన్యం లోకి చూస్తూ కూర్చుని ఉన్నా డొక యువకుడు అతని పక్క_సీటు కాళీగా, బోసిగా ఉంది _ అతని హృదయంలాగే. అతని జేబులో చింపని టిక్కట్టు ఒకటి కునుకు తీస్తూంది 'ట్రూడ్ స్వాన్'

అద్భుతంగా వయోలిన్ వాయించేస్తూంది జనంతో క్రిక్కిరిసి ఉన్నా, హాలులో నిశ్శబ్దం తాండవిస్తూంది గట్టిగానిట్టూర్చే ధైర్యంకూడాలేక శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు యువకుడు.

కాన్సర్ట్‌పై దృష్టి కేంద్రీకరించి వింటున్నట్టే వున్నాడు – కాని ఒక్క పీస్‌కూడా విన్నట్టులేదు కోపంతోటీ, ఉడుకుమోతుతనంతోటీ దవడలు బిగ దీసుకు కూర్చోకపోతే అందంగానే కన్పించేలా ఉన్నా డా యువకుడు మా టి మా టి కీ మునిపంటితో పెదవి కొరికి ఎక్కడ తప్పటడుగు వేశానా అని ఆలోచిస్తున్నట్టుగా ఉన్నాడు...

చైనాబజారులో సాయంత్రపు జనం హడావిడిలో కిటకిట లాడుతున్న ఒక కాఫీహోటలులో ఓ అమ్మాయి కూర్చుని ఉంది కిటికీలోంచి దీపతోరణాలు చూస్తూ రేగనిజుట్టుని పదేపదే ఎడంచేత్తో పట్టుకుంటూ కూర్చుని చూస్తూంది కోపంతో బుసలుకొడుతున్నట్టు కదలాడుతున్నాయి ఆమె ముక్కుపుటాలు. అర్థం పర్థం లేని పద్ధతిలో చాలా అందగత్తెలాగే ఉంది. కళ్ళలో ప్రజ్వరిల్లుతున్న కోపం ముఖంలో అందాన్ని మైనస్ చేసేస్తూంది. సర్వర్ తెచ్చిన కాఫీ ముట్టుకోలేదు కిటికీలోంచి దృష్టిని మళ్ళించలేదు...

కాఫీహోటల్లో కూర్చున్న అమ్మాయి మ్యూజిక్ హాల్లో అబ్బాయి పక్క ఖాళీగా ఉన్న సీటులో కూర్చుందు కెం తేనా ఆత్రం పడుతూనేఉంది కాని ఆ క్షణంలో పొగరుబోతు గుఱ్ఱాలను కట్టి లాగించినా అమ్మాయి నా అబ్బాయిపక్క కూర్చోపెట్టడం కష్టం.

మ్యూజిక్ హాల్లో అబ్బాయి – తన సర్వస్వాన్నీ ధారపోసేవాడే, ఆక్షణంలో కాఫీహోటల్లో అమ్మాయి పక్కన చేరడానికి. కాని తనెత్తు ధనం పోసినా ఎవరూ అతన్ని క్షణంలో అక్కడికి నడిపించలేరు!

మరి యీ ప్రతిష్టంభనకి కారణం ఏమిటి? అహం బాబూ, అహం. తెలివి తక్కువ అహంభావం అడ్డు నిలచింది– బెర్లిన్ గోడలాగా. నిజంగా ఇది దారుణం అయిన పరిస్థితే – ఎందుకంటే– ఇద్దరి కిద్దరూ చదువుకుంటున్నవాళ్ళు; ఇంగితం ఎరిగినవాళ్ళు; ముఖ్యంగా సయుక్తిక మార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చునని నమ్మేవాళ్ళే. సైకాలజీలో డాక్టరు పట్టాకి చదువుతున్న బుద్ధిమంతులు...

–గత మాసంలో అథెల్లో నాటకం చూడవెళ్ళి – సుందరి (కాఫీ హోటల్లో అమ్మాయి) సూర్యారావుని (మ్యూజిక్ హాల్లో అబ్బాయి) అడిగింది కదా:

"మొదట్లోనే అథెల్లో డెస్డెమోనా దగ్గిరకు వెళ్ళి సూటిగా అడిగిఉండవచ్చుగా– ఇదుగో ఈ నీ జేబురుమ్మాలు ఎలా చిక్కిందనీ?–అలా ఎందుకుచేయలేదు?"

''అహం, ప్రభూ, అహం అడ్డొ

చ్చింది మానవ సంబంధ బాంధవ్యాలలో దానికి ఎక్కువ పాత్రే ఉంటూంటుంది," అన్నాడు ఖచ్చితంగా సూర్యారావు.

"నా సంబంధ బాంధవ్యాలలో దాని కసలు తావుండదు సూర్యం; అలాంటి అహం తలెత్తనివ్వను... రెండో రంగ ములో యీ గొడవ తేల్చేసుకుంటే గొడవే వుండేదికాదు," అని నిట్టూర్చింది సుందరి.

"అలాగే జరిగివుంటే ప్రపంచ సాహిత్యంలో ఒక విషాదాంత నాటకం కొరవడేదే!" అంటూ సుందరి చెయ్యి నొక్కాడు సూర్యారావు. అంతేకాదు ఎమెండ్మెంటు ప్రతిపాదించాడు.

"అలా అని నీ ఉద్దేశ్యాలతో ఏకీభ వించడం లేదనుకోకు అంతర్వాహికంగా మన ఉద్దేశ్యాలు ఒక్కటే!" అన్నాడు అవునుమరి – ఆ రోజులలో అన్ని విష యాలలోనూ వారు ఏకీభవించేవారే.

వివాహపు తొలిసంవత్సరం ఒడిదుడు కులతో కూడి ఉంటుం దో ప్రేమాంకపు తొలివసంతం. అంత సులువుగా ఇంద్ర ధనువుపై ఊయల లూగినంత హాయిగా ఉంటుంది!...కాని తొలివత్సరపు మలు పులోనే మనకు తెలియకుండా ఉంటుంది– 'ప్రమాదం! జాగ్రత్త'' అన్న సైనుబోర్డు. తాము మినహా ఇతర ప్రపం చము లేదనుకున్న ప్రేమికులకి పరాయి ముఖాలు కనిపించడం ప్రారంభిస్తాయి. దాంతో తమలో తాము ప్రశ్నించుకోవడం ప్రారంభిచుతారు. 'నాకు కావలసిన సర్వస్వం ఇంతేనా?' అని.

ఇటువంటి ప్రమాదకరమైన స్థాయికి వచ్చి నిలిచిం దారోజు మునిమాపువేళ – సుందరీ, సూర్యారావుల ప్రేమైక జీవితం


కాఫీహోటల్లో కూర్చున్న అమ్మాయి ప్రాణం విసిగింది

"ఇంక చాలురా భగవంతుడా! ఇంకచాలు ఎంత ప్రేమిస్తేమటుకు మరీ అంత తేలికగా కొట్టిపారేయడం ఏమిటి? నేనంత లోకువయిపోతానా! కలలోమాట. ఏ మగవాడూ నన్నేమంత ఇదిగ చూడలేదు! హాఁ" అని హఠాత్తుగా కుర్చీలోంచి లేచినిలబడింది. చేతిసంచీ లాగిన జోరులో పక్కబల్లమీది కప్పు తిరగబడింది.

"క్షమించండి, చూసుకోలేదు."

"దాని కేం ఫరవాలేదు," అంటూ బుష్షర్టు మీద కాఫీరం గేమంత ఎబ్బెట్టుగా కనపడడం లేదని జేబు రుమాలుతో తుడుచుకు సర్దుకున్నాడు, పక్కబల్ల దగ్గర కూర్చున్న అబ్బాయి. అతనితోకూడా ఉన్నఅమ్మాయి అబ్బాయి మింగలేని, కక్కలేని పరిస్థితికి గలగల నవ్వింది. అప్పటికి కాని 'ఎవరా?' అని తలెత్తి చూడలేదు సుందరి.

"నువ్వటోయ్ లతా! చంపావు – ఎవరో అనుకున్నాను" అంటూ వాళ్ళతో పాటు కూర్చుండిపోయింది సుందరి.




"ఇతను నా స్నేహితుడు, ఆర్టిస్టు;" పరిచయంచేసింది లత.

"నమస్కారం. ఏమీ అనుకోకండి. ఎక్కడో ఆలోచిస్తూ మీ కాఫీకప్పు తోసేశాను!" అంది నవ్వుతూ సుందరి.

"ఏమిటోయ్ సుందరీ, చాలా తీవ్రంగా ఉన్నా వీవేళ? అది నీ తత్వం కాదే." నవ్వుతూ అడిగింది లత.

"మరే...... మీ రిలా కోపిష్ఠిలాగ తోచడంలేదు." అన్నాడు ఆర్టిస్టు.

'నీ ముఖం నీ కేమి తెలుసులే,' అనుకుని లతకి బదులు చెప్పింది సుందరి "కోపంలేదు; తిక్కగా ఉంది."

"ఎవరిమీద?" లత అడిగింది.

"ఇంకెవరూ, సూర్యంలేడూ" అంది సుందరి.

"ఉన్నాడు. కాని ఇక్కడ లేడే?"

"ఇక్కడెలా ఉంటాడు? హాయిగా కాన్సర్ట్ వింటూ కూర్చునిఉంటాడు."

"బాగుంది."

"ఏం బాగుంది? 'మధ్యాహ్నం అంతా అలాఅలా తిరిగి, జూ చూసి సాయంత్రం వయొలిన్ కాన్సర్ట్‌కి వెడదాం' అన్నాడు. 'నీ ముఖం, జూకీ, కాన్సర్ట్‌కీ సంబంధం ఏమిటి? నేను రాను అన్నాను'"

"పోనీ సాయంత్రం కచేరికి వెళ్ళవలసింది." సూర్యంమీద జాలిపడుతూ అంది లత.

"ఎందుకెళ్ళాలి. నే నేం అతని పెంపుడు జంతువునా? నా కేం పనీపాటా ఉండవా?" కోపంగా లతని అడిగింది సుందరి.

"ఉన్నాయా?" అంది లత ఆర్టిస్టు కేసి చిలిపిగా చూస్తూ.

"లేవు; అయితే మాత్రం? 'పోనీ కాన్సర్ట్‌కేనా వస్తావా?' అని అడిగాడు. తిక్క రేగి 'ఏమో!' అన్నాను.

"'నీకంతగా యిష్టం ఉన్నట్టులేదు.' అన్నాడు. 'నీ కింకెవరినేనా తీసుకువెళ్ళాలని ఉంటే చెప్పకూడదూ?' అడిగానోయ్ లతా?"

"ఏమన్నా డేమిటి?"

"ఏమీ అనలేదు. 'ఇక నీ యిష్టం — వస్తే నీ కోసం ఇవతల నిలబడి ఉంటాను రా' అన్నాడు, లేకుంటే తను వెడతా డన్న మాటేగా?..."

"బాగుంది నీ వరస. కోపం లేకుండా ఆలోచించిచూడలేక పోయావా సుందరీ?" అంది లత.

"నా మొఖం! అలా చేస్తే నీకు కోపం రాదా? ఏమండీ, మీ రెప్పుడేనా లతని అలా ట్రీట్ చేస్తారా?" ఉన్నట్టుండి ఆర్టిస్టుని ప్రశ్నించింది సుందరి. "లేదులేదు, మీ రలా చేయరు. మిమ్మల్ని చూస్తేనే తెలుస్తూంది," అని తనే సమాధానం కూడా చెప్పేసింది...అంతాకలిసి బయటికి వచ్చి మెరీనా దారిన వెళ్ళే బస్సు ఎక్కారు.

అప్పుడే కాన్సర్ట్ ముగిసింది. అందరితోపాటు అబ్బాయి ఇవతలకి వచ్చాడు. ఇద్దరు ముగ్గురు తెలిసిన ముఖాలతో కలిసి నడక సాగించాడు. కబుర్లు చెప్తూ ఎడ్వర్డు ఇలియట్స్‌రోడ్డు కొలవడం ప్రారంభించారు. సంగీతం గురించి చర్చ అయ్యేసరికి గాంధీ విగ్రహం కళ్ళకు కడుతూంది... అప్పుడున్నట్టుండి భాస్కరం ఒక తెలిసిన ముఖం) అడిగాడు:"సుందరి రాలేదేం?"

"ఏమో తెలియదు" అన్నాడు సూర్యారావు.


"అదేమిటీ! ఏం జరిగిందేమిటి?"

"ఏమో నా కెలా తెలుసూ; హాలు బయట వచ్చి కలుస్తుందని చూశాను; రాలేదు." నిస్సారంగా సమాధానం చెప్పాడు సూర్యారావు. "నేనంటే అంత విసుగనిపిస్తే ఇక నాకుమటు కావిడ గారితో పనేమిటిరా?" సిగరెట్టు తీసి అంటించబోయి మానేశాడు సూర్యారావు. బీచిలోకి వెళ్ళి ఇసకలో కూలబడ్డారు స్నేహితులు నల్గురూ. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి.

బీచిలోని దీపాల వెల్గుముందు వాటి వెల్గు ప్రత్యేకంగా కన్పిస్తూంది. మెడ కింద చేతులు తలగడలా అమర్చుకుని వెల్లికిలా పడుకున్నాడు సూర్యారావు... ఇద్దరు స్నేహితులు మెల్లిగా జారుకున్నారు. భాస్కరం మిగిలాడు. నక్షత్రాలు లెక్కపెడుతూ స్నేహితుణ్ణి ఓదార్చడం ఎలాగ అని ఆలోచిస్తున్నాడు భాస్కరం.

అందుచేతనే —

సుందరీ సూర్యాల ప్రేమాయిణం విషమ ఘట్టంలో పడిం దనుకోవాలి. ఒకరిమీద ఒకరికి అంతులేని ప్రేమ




ఉన్నమాట వాస్తవమే. దాంట్లో అబద్ధం లేదు. కాని ఈ క్షణంలో ఆ ప్రేమ - దెబ్బతిన్న అహం రేపిన అర్థంలేని ఊహా జ్వాలల మాటున పడిపోయి - క్షీణంగా కనిపించడంలేదంతే! ఒకరికి ఒకరు కావాలి. కాని - కాని ఎవరికి వారే - ఎదుటి వ్యక్తి తన నెక్కువగా కాంక్షించాలన్న ఆత్యాశ! ఆ అత్యాశ ధర్మమా అంటూ - ఆ రోజున - సంవత్సరం పాటు పెంచిన ప్రేమ సంగతి, తీయని కలల సంగతి, గాలిమేడల సంగతి మరిచిపోయారు! ఈ క్షణంలో ఒకరినొకరు రెచ్చకొట్టి బాధ పెట్టుకోవాలని చూస్తున్నారు...

దూరంనుంచి బీచిహోయిని సహితం మింగేస్తూ గలగల మాటలు గాలివాటంలో పడుకునిఉన్న సూర్యారావు కేసి వస్తున్నాయి. హఠాత్తుగా లేచి కూర్చున్నాడు సూర్యారావు. భాస్కరం మాటలు వస్తున్న వేపు ముఖం తిప్పాడు. "ఆదిగో సుందరి. అతగాడెవరు?" సూర్యారావు ప్రశ్నించాడు.

అదే క్షణంలో సుందరి సూర్యారావుని చూస్తూ మాట్లాడుతున్న మాట మధ్యలో రకీమని ఆపేసింది.

అప్పుడు చూసింది - ఇసుకలో కూర్చున్న భాస్కరాన్నీ, సూర్యారావునీ లత.

"అడుగో సూర్యం," అంది.

"అవును. ఇప్పుడే నేనూ చూశాను." కల్గిన ఆనందంమీద పల్చటి విషాదపు పొర కప్పింది.

సుందరిని చూసి ముఖంవిడిన సూర్యా రావు, చూస్తూండగానే వాడిపోయాడు.

"రావోయ్! రండి లత గారూ, కాస్సేపుకూర్చుందాం;" భాస్కరం ఆహ్వానించాడు.

"మీరూ ఉన్నారా" అంటూ చతికిల బడింది లత. ఆర్టిస్టుని పరిచయం చేసింది.

"మీ బొమ్మ లీ మధ్య ప్రదర్శనలో చూశాం, నేనూ సుందరీ" అన్నాడు సూర్యారావు.

"అవును. అతని కేం నచ్చలేదు. కాని నాకు చాలా బాగా ఉన్నాయి," అంది సుందరి తన ఆరాధన నంతా కళ్ళలో నింపి ఆర్టిస్టుకేసి చూసింది.

సూర్యారావు హృదయం కోపంతో ఎగిరిపడింది. ఎంతలో మారిపోతా రీ ఆడవాళ్ళు. జన్మలో ఇంకో ఆడదాన్ని నమ్మకూడదు అనుకున్నాడు.

'మంచిపనైంది. అంతేకావాలి' అని సంతోషపడ్డా, బాధతో మూల్గిన హృదయాన్ని దాచుకోలేకపోయింది సుందరి.

సముద్రంమీద చంద్రుడు తలెత్తాడు. ఆ క్షణంలో సముద్రము రూపే మారిపోయింది. వెండి జలతారులాగా కదలాడుతూంది సముద్రం. ఆర్టిస్టూ, లతా నీళ్ళ దగ్గరికి నడిచారు. మిగిలినవారి కంట పడదని తోచగానే ఆర్టిస్టు లత నడుంచుట్టూ చేయి వేసి ముందుకి నడిపిస్తున్నాడు.

సత్రకాయిలాగా నే నెందు కనుకున్న భాస్కరం 'సిగరెట్టు తెచ్చుకుంటా' నంటూ రోడ్డెక్కాడు.

సూర్యరావు సుందరికేసి చూస్తున్నాడు. సుందరి కుడిచెంపలోని నరం కొట్టుకుంటూంది.ఎన్నోసార్లుగమనించా-ఎక్కువ బాధపడితే, నెర్వస్‌గా ఫీలైతే సుందరి చంపలోనరం తీవ్రంగా కొట్టుకుంటుంది ...... తొణకనట్టున్న సుందరి అంతరాంతరాలలో జరుగుతున్న సంఘర్షణ కనులకు కట్టినట్టు చూపుతుం దా నరం......సూర్యారావు గుండె జాలితో నిండిపోయింది. అటూ ఇటూ చూసి 'సుందరి' అంటూ సుందరి చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు. సుందరి రేగినజుట్టు సూర్యారావు చెంపలకి తగులుతూంది.

"ఎందుకంత నెర్వస్‌గా ఉన్నావు?"

"నేనా ?"

"నన్ను చూస్తేనేనా ?"

"ఔను...కాదు కాదు. నాకు తెలియదు."

"కాన్సర్ట్‌కి ఎందుకు రాలేదు ?"

"నే వచ్చినా రాకపోయినా ఒకటేగా నీకు ?"

"నువ్వు ఎక్కడికేనాసరే - ఎప్పుడేనాసరే నావెంట రావాలి. అది నాకోరిక అని, నీకు తెలియదా సుందరీ! నీకు రావాలనిపించలేదూ ? నేను నీ కోసం ఎదురుచూస్తా ననిపించలేదూ ?"



సముద్రంమీదనుంచి పాకినట్టు వెన్నెల ఇసుకనంతా ఆక్రమిస్తూంది. జనం సందడి పూర్తిగా తగ్గిపోతూంది.

"రావాలనేవుంది కాని..." నసిగింది సుందరి.

'మరయితే ఎందుకు రానట్టు?' ఆప్యాయంగా సుందరిని దగ్గిరకి లాక్కు కూర్చోబెట్టుకున్నాడు సూర్యారావు. అయిష్టంగానే ముందుకి జరిగినా ఆతణ్ణి ఆనుకు కూర్చుని సముద్రం కేసి

చూస్తోంది సుందరి. దూరంలో వెన్నెల కడిగిన బొమ్మలలాగా కన్పిస్తున్నారు— లతా ఆర్టిస్టూ.

"ఏమో."

"పోనీ ఇప్పుడేనా మనిద్దరం కలిసి కాసేపు గడుపుదామా?"

"మరి భాస్కరం?"

"ఏడీ? వాడెప్పుడో వెళ్ళిపోయాడు. మరి లత?"

"దానికి నేనో సెన్సారులాగా దాపరించాను;" సన్నగా నవ్వింది సుందరి. వెన్నెలలో ఆమెకళ్ళు వింతగా మెరిశాయి.

"అయితే లే— అలా యూనివర్సిటీ బిల్డింగుల దాకా నడిచి తిరిగివద్దాం;" లేచి సుందరిని లేవతీశాడు సూర్యం.

"సూర్యం..." ఏమి అనాలో తెలియక ఆగింది సుందరి.

"ఏమిటి సుందరీ?"

"నేనంటే ఇంకా ప్రేమ ఉందా నీకు?" అతని జబ్బకి ముఖం ఆన్చుకు నడుస్తూ అడిగింది సుందరి.

"సుందరీ, ఎప్పుడూ నిన్ను ప్రేమిస్తూనే ఉన్నాను. నీకు చెప్పలేదా?" ఆమాంతం సుందరి నడుంమీద చెయ్యి వేసి దగ్గిరకి లాక్కున్నాడు. ఆధునిక కవికుమారుడే అయినా సూర్యానికా క్షణంలో కోయిల కూస్తే బాగుండు ననిపించింది.

"నువ్వు లేకుంటే నేనూ ఉండలేను సూర్యం. మనం ఇంకెప్పుడు దెబ్బలాడుకో వద్దు;" ఆత్రంగా ముఖం ఎత్తి అతని కళ్ళల్లోకి చూసింది సుందరి.

అసలే వెన్నెల.

చుట్టూ ఉన్నది— ప్రశాంతమైన వాతావరణం.

దూరంలో సముద్రపు ఘోష.

వెన్నెల నింపుకొన్న సుందరి కళ్ళు.

ఇక ఉండలేక ఇటూ అటూ చూసి ఎవరూ చూడ్డంలేదని— వంగి సుందరి పెదవులు ముద్దుపెట్టుకున్నాడు సూర్యారావు. ఫ్రీగా ఉన్న చేతిని అతని మెడ మీద వేసింది సుందరి. చుట్టూ వున్న గులేమాహల్ చెట్ల వెడల్పాటి ఆకులు వెన్నెలనుంచి వారిని దాచేస్తున్నాయి.

—ఇక అమ్మాయినీ అబ్బాయినీ ఇక్కడ వదిలేద్దాం— స్వీట్ నథింగ్స్ మాట్లాడుకుంటారు — తమని క్షణం క్రితం ముంచుదా మనుకొన్న తుఫాను సంగతి మరిచిపోతారు. (టీ కప్పులో తుఫా నంటే ఇదే కాబోలు!) దీపపు మెరుగులని ఆకర్షిస్తుంది వెలుతురు. లవర్స్ పాత్‌లో ప్రేమికులని ఆకర్షిస్తుంది చీకటి??